# మన గ్రామ దేవతలు

అమ్మలఁగన్నయమ్మ ముగురమ్మల మూలపుటమ్మ చాలఁబె
ద్దమ్మ సురారులమ్మ కడుపాఱడి బుచ్చినయమ్మ దన్నులో
నమ్మిన వేల్పుటమ్మల మనమ్ముల నుండెడియమ్మ దుర్గ మా
యమ్మ కృపాబ్ధియిచ్చుత మహత్త్వ కవిత్వ పటుత్వ సంపదల్



గుణత్రయాత్మకమగు మహాశక్తియే ప్రపంచము యొక్క సృష్టి, స్థితి, లయముల చేయుచున్నది. స్త్రీ రూపిణి యగు ఆమెను కొల్చేవారికి ఆమె సమస్త కోర్కెలను నెరవేర్చును. మన పూర్వీకులు ఆ దేవిని ఉపాసించి ఇహ పరముల రెండింటిని సాధించిరి. ఆమెను గురించి అనేక ఉపనిషత్తులు, పురాణములు, మహాతంత్ర గ్రంథములు, విశేషవిషయములనే కాక దేవీ ఉపాసన క్రమమును శాస్త్ర గ్రంథములు వివరించినవి.

ఆ సర్వశక్తి స్వరూపిణియే పరబ్రహ్మాణి, మహాలక్ష్మి, మహాకాళి, మహాసరస్వతి, రాజరాజేశ్వరి, గాయత్రి, భవాని, కనకదుర్గ, వనదుర్గ, పార్వతి, భగళా, రాజ శ్యామల, వారాని, మహిషాసురమర్ధని, కామాక్షి, మీనాక్షి, కన్యక మొదలగు విశేషార్థ ప్రదములైన నామములతో ఆ జగదంబ పూజింపబడుచున్నది. ఆ మహాదేవి అంశ యొక్క శక్తులే ఈగ్రామ దేవతలు. వారిని ఎన్నో పేర్లతో వారి వారికి అను కూలమైన పేర్లతో పిలుస్తూ ఆ తల్లులకు పూజాది కార్యక్రమాలను



చేస్తారు. అంకమ్మ, అంకాలమ్మ, పోతమ్మ, ఎల్లమ్మ, గంగమ్మ, గంగనమ్మ, గంగానమ్మ, గరిటమ్మ, గరటమ్మ, గంటమ్మ, గంటలమ్మ, గోగులమ్మ, పల్లకమ్మ, పల్లాలమ్మ, పెద్దమ్మ, పెద్దింట్లమ్మ, పోలకమ్మ, పోలేరమ్మ, మారమ్మ, మామిళ్ళమ్మ, మావుళ్ళమ్మ, మాపూరమ్మ, ముత్యాలమ్మ, మొగదారమ్మ, మారెమ్మ, మైసమ్మ, సమ్మక్క సారలమ్మ, నాంచారమ్మ, దేశాలమ్మ, వెంకమ్మ, వనుమలమ్మ, మహంకాళమ్మ, మంగమ్మ, ముసలమ్మ, పుంతలో ముసలమ్మ, పీట్లమ్మ, తలుపులమ్మ, తిరుపతమ్మ, దానమ్మ, గోగులమ్మ, పోచమ్మ, బోసెమ్మ, బోడెమ్మ, బొడ్డెమ్మ, దురగమ్మ, బతుకమ్మ, కోట్లమ్మ, కోటమ్మ, కొండమ్మ, కొండాలమ్మ, బోనమ్మ, చల్లాలమ్మ, పల్లాలమ్మ, పల్లమ్మ, మల్లాలమ్మ, మరిడమ్మ, బంగారమ్మ, నూకాలమ్మ, మాచారమ్మ, వెలగలమ్మ, కట్టమ్మ, బరుసులమ్మ, ఎల్లారమ్మ, నూకమ్మ, పుల్లమ్మ, మానికమ్మ, గౌరమ్మ, పైడితల్లి మొదలగు పేర్లతో పిలుస్తారు. వీరు మన గ్రామ రక్షణ బాధ్యతను స్వీకరించి మనలను రక్షించెదరని మన పూర్వీ కుల నమ్మకం. మన భారత దేశముననే కాక ప్రపంచంలోని అన్ని దేశములందు కూడా ఈ నమ్మకము కనిపించుచున్నది. ■

# సమ్మక్క - సారక్క





సమ్మక్క సారక్కలు గిరిజనుల ఆరాధ్య దైవాలు. ఆసియా ఖండంలోకెల్లా పెద్ద జాతర కుంభమేళా. ఆ తరువాత అతి పెద్ద గిరిజన జాతర సమ్మక్క సారక్క మేడారం జాతర. వరంగల్‌కు 110 కి.మీ. దూరంలో ఉన్న తాడ్వాయి మండలంలోని మేడారంలో రెండు సంవత్సరాలకు ఒక సారి జరుగుతుంది. సమ్మక్క సారక్కలను దర్శించడానికి ఇతర రాష్ట్రాల నుండి కూడా లక్షలాది మంది భక్తులు వచ్చి జంపన్నవాగులో పవిత్ర స్నానాలు చేసి, తలనీలాలు సమర్పించి బంగారంగా భావించే బెల్లంతో తమ ఎత్తు తులాభారం వేసి, ఆమెకు సమర్పిస్తారు. సమ్మక్క సారక్కలను వన దేవతలుగా గిరిజనులు భావించి వారిని కొలు స్తారు. ఈ వనదేవతలు వారి యొక్క కష్టాలను తీర్చే కలియుగ దైవాలుగా భావించి పూజలు చేస్తారు. 12వ శతాబ్దంలో కరీంనగర్ జిల్లా జగిత్యాల ప్రాంతం

ప్రేమ స్వార్థ రహితమైనది. స్వార్థం ప్రేమ రహితమైనది. - శ్రీ సత్యసాయిబాబా

Scanned with CamScanner

లోని పొలవాసను మేడరాజు అనే గిరిజన దొర పాలించేవాడు. ఆయన ఒకనాడు వేటకు వెళ్ళినప్పుడు సింహాల మధ్య ఎంతో పవిత్రంగా ప్రకాశిస్తున్న ఒక బాలిక ఆయనకు కనబడింది. ఆమెను కొండదేవర ప్రసాదంగా భావించి తన ఇంటికి తీసుకొనివచ్చి సమ్మక్క అని పేరు పెట్టారు. ఆమె వచ్చిన దగ్గర నుండి గిరిజనుల ఇళ్ళల్లో ఎన్నో సంపదలు నెలకొన్నాయి. గూడెంలోని ప్రజలంతా ఆనందాలతో జీవనం సాగించారు. సింహాల మీద స్వారీచేసే ఆమె సంతానం లేనివారికి సంతానాన్ని, రోగ బాధలతో ఉన్న వారి కష్టాలను కూడా నివారించేది. యుక్త వయస్సు వచ్చిన సమ్మక్క మేడారంను పాలించే పగిడిద్ద రాజును వివాహం చేసుకొంది. వీరికి సారలమ్మ, నాగులమ్మ, జంపన్న అను ముగ్గురు సంతానం కలిగారు. కొంతకాలం తరువాత మొదటి ప్రతాపరుద్రుడు మేడరాజుపై దండెత్తగా ఆయన మేడారం పారిపోయాడు. తరువాత ప్రతాపరుద్రుడు మేడారం పైకూడా ధండెత్తాడు. ఆ యుద్ధంలో మేడరాజు పడిగిద్ద రాజు, సారలమ్మ, నాగులమ్మ వీరమరణం పొందారు. ఈ అవమానంతో జంపన్న సంపెగ వాగులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆనాటి నుండి ఆ వాగు జంపన్న వాగుగా ప్రసిద్ధి పొందింది. తనవారు వీరమరణం పొందారని తెలిసికూడా సమ్మక్క వీరోచితంగా పోరాడడాన్ని గమనించిన ప్రతాపరుద్రుడు ఆశ్చర్యపోయాడు. చివరకు శత్రువు దొంగచాటుగా బల్లెంతో పొడవగా తన రక్తపుచుక్క ఒక్కటి కూడా నేలపై పడిన ఆ ప్రాంతమంతా కరువు కాటకాల మయమవుతుంది అని తెలుసుకున్న సమ్మక్క ఒక రక్తపు చుక్క కూడా నేలపై పడకుండా గాయానికి కట్టుకట్టుకొని ఆ దొంగదెబ్బ తీసిన శత్రువును చంపి యుద్ధభూమి వదలి చిలుకలగుట్ట వైపు వెళుతూ అదృశ్యమైపోయింది. తరువాత గిరిజనులు సమ్మక్క కోసం అడవంతా గాలించి ఒక నాగవృక్షపు నీడలో ఉన్న పాము పుట్టదగ్గర పసుపు కుంకుమలతో నింపిన ఒక కుంకుమ భరిణ కనిపించగా సమ్మక్క తల్లే కుంకుమ భరిణగా మారినదని, ఆకుంకుమ భరిణనే ఆమె రూపుగా, దానినే సమ్మక్క తల్లిగా భావించి ఆ ప్రాంతంలో మాఘ శుద్ధ పౌర్ణమినాడు దేవిని ప్రతిష్ఠించి జాతర ఎంతో వేడుకగా జాతర చేసుకుంటారు.



మేడారం జాతరకు హాజరైన అశేష జన వాహిని




సమ్మక్క, సారక్కలు

## బతుకమ్మ కథ



భట్టునరసింహ అనే రాజు కవి-చోళదేశం పరిపాలించేవాడు. ఆయన చాలా ధర్మాత్ముడు. అతని భార్య సత్యవతి. ఒక యుద్ధంలో ఆ రాజు తన బంధుమిత్రులను కోల్పోయి రాజు తన భార్య సత్యవతితో అడవులకు వెళ్ళిపోయాడు. ఆ తరువాత ఆయన శ్రీమహాలక్ష్మిదేవిని మనసున తలచి గొప్ప తపస్సు చేశాడు. కొంత కాలానికి శ్రీమహాలక్ష్మిదేవి కరుణించి, సాక్షాత్కరించి ఏమి వరం కావాలని అడిగింది. మాకు సంతానం లేక బాధ పడుతున్నాము తల్లీ ! మమ్ములను కరుణించి నీవే మా కుమార్తెగా జన్మించాలని వేడుకొన్నారు. అందుకు ఆ మహాలక్ష్మిదేవి సంతోషించి తథాస్తు అన్నది. కొంత కాలానికి సత్యవతి గర్భాన శ్రీమహాలక్ష్మిదేవి జన్మించింది. ఆ బాలికను చూచి మునులు, ఋషులు ఎంతో సంతోషించి అనారోగ్యాలు లేకుండా బాగా బతుకమ్మ అని దీవించారు. ఆనాటి నుండి ఆమెను బతుకమ్మగా పిలువ సాగారు. బతుకమ్మ జన్మించిన కొంత కాలానికే రాజు తిరిగి తన



రాజ్యాన్ని సంపాదించి రాజ్యమేలాడు. ఆ రాజ్య ప్రజలు సుఖ శాంతులతో ఎంతో ఆనందంగా జీవించారు. బతుకమ్మ పెరిగి పెద్దదై యుక్త వయస్సు వచ్చింది. శ్రీమహావిష్ణువు చక్రాంకుడు అనే రాజుగా వచ్చి బతుకమ్మను వివాహమాడాడు. ఆ దంపతులు ఎంతో కాలం సిరిసంపదలతో రాజ్యపాలన చేశారు. బతుకమ్మను కొంతమంది బొడ్డెమ్మగా కూడా పిలు స్తారు. మరి కొంత మంది గౌరమ్మగా భావించి **శ్రీలక్ష్మి నీ మహిమలూ గౌరమ్మ చిత్రమైతోచునమ్మా! భారతీ సతీవై బ్రహ్మాకిల్లాలివై, పార్వతీ దేవివై పరమేశు పత్నివై, పరగ శ్రీలక్ష్మివై గౌరమ్మ భార్యవైతివి శ్రీహరికినీ** అని బతుకమ్మను పేర్చి స్త్రీలు, పిల్లలులయ బద్ధంగా పాడుతూ బతుకమ్మను ఆడతారు.

శ్రీ చక్రానికి ప్రతిరూపంగా తలచి బతుకమ్మను ఒక పళ్ళెంలో రంగు రంగుల పూలతో గుండ్రంగా ఎత్తుగా పేర్చుతారు. పసుపు ముద్ద చేసి ఆ ముద్దను గౌరమ్మగా భావించి బతుకమ్మపైన పెడతారు. బతుకమ్మను దేవుని ముందు ఉంచి, పూజలు చేసి ఇంటి ముందర పెట్టి ఇరుగు పొరుగు స్త్రీలు కూడా తాము చేసిన బతుకమ్మలను కూడా తీసుకొని వచ్చి ఇంటి ముందు పెట్టి అందరూ కలసి లయబద్ధమైన అడుగులు వేస్తూ చప్పట్లు కొడుతూ బతుకమ్మల చుట్టూ తిరుగుతూ "బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో ! బంగారు బతుకమ్మ ఉయ్యాలో!" అని ముందుకు వంగుతు లేస్తూ ఒకరు పాడగా, మిగతా వారు అందరూ ఆమె పాడిన విధంగా పాడతారు. ఈ బతుకమ్మ పాటలలో ఎన్నో నీతులు, ఎన్నో సంప్రదాయ విలువలు నిండి ఉంటాయి.



**తెలంగాణా తల్లి చేతిలో తెలుగువారి పవిత్ర బతకమ్మ**

పెద్ద చెట్టు నీడలో ఒక చిన్న చెట్టు పెరిగితే అది చిన్నదిగానే మరణిస్తుంది. – సెనగలీస్ సామెత

Scanned with CamScanner